క్లుప్తంగా

లోకో పైలెట్ రెస్ట్‌రూం ప్రారంభం



లోకో పైలెట్ రెస్ట్‌రూమ్‌ను ప్రారంభించి అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం పాటిల్

ఏలూరు టౌన్‌: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో లోకో పైలెట్ రెస్ట్‌రూమ్‌ను విజయవాడ రైల్వేస్ డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ఏలూరు జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడ పరిస్థితులను ఆరా తీశారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సై సైమన్, స్టేషన్ మాస్టర్, అధికారులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారీవర్షాల నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. పవర్‌పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటువంటి విపత్కర సమయంలో ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా మెరక చేయాలని అన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.

సాయి బాబాకు విశేష పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపుపేట సాయిబాబా ప్రేమ మందిరంలో ఈ నెల 21వ తేదీన గురు పూర్ణిమ పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మందిర అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో బాబాకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రేమ మందిర అభివృద్ధికి సేవలందిస్తోన్న సాయి సేవకులకు పైజామా, లాల్చీ దుస్తులను బహూకరించారు.


గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద రోగులకు, ఆర్‌ఆర్‌పేట రోడ్డులో వెళ్లే పాదచారులకు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి గొడుగులను పంపిణీ చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఏలూరు వైభవ్ జ్యూయలరీస్ అధినేత గ్రంధి అమరేంద్ర సహకారంతో 30 మందికి గొడుగులు పంచామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, డాక్టర్ జి.స్పందన, ఎ.సూర్యనారాయణ ఉన్నారు.

'మిషన్ శక్తి'పై అవగాహన



మిషన్‌శక్తి గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి

ఉంగుటూరు: మహిళలు, బాలికలకు అండగా మిషన్‌శక్తి కార్యక్రమాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీవీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు 185 అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు, బాలికలకు మిషన్‌శక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ 100 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలతో మహిళలు శక్తి వంతులుగా మారతారని, సమస్యలను పరిష్కరించుకునే శక్తి వారిక వస్తుందని వివరించారు. జూన్ 21 నుంచి అక్టోబరు 4 వరకు మిషన్ శక్తి కార్యక్రమాలు సీడీపీఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాల్య వివాహాలు, బాలికలపై హత్యాచారాలను అరికట్టేందుకు తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళల సంరక్షణకు ఒన్‌స్టాప్ సెంటర్‌ను వినియోగించుకోవాలని తల్లులకు సూచించారు.

ఎంఆర్‌పీఎస్ సమావేశాలు నిర్వహించాలి

దెందులూరు : ఎంఆర్‌పీఎస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు ఈ నెల 24లోపు అన్ని జిల్లా, మండల, గ్రామాల్లో విధిగా నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ కోరారు. శుక్రవారం కొత్తపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు కోసం జాతీయ యావత్తు ఎదురుచూస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ స్ఫూర్తితో దశాబ్దాలుగా జరిగిన ఉద్యమంలో వందలాది మంది ప్రాణాలు అర్పించారన్నారు. ప్రతి గ్రామంలోనూ ఎంఆర్‌పీఎస్ జెండా ఎగురవేయాలని సూచించారు.

నగరంలో కుండపోత వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అల్పపీడన ద్రోణి కారణంగా నగరంలో గురువారం నుంచి వర్షం కురుస్తునే ఉంది. శుక్రవారం ఉదయం కుండపోతగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తంగెళ్లమూడి, పుష్పలీలా నగర్, బీడీ కాలనీ, చెంచుల కాలనీ, బావిశెట్టి వారి పేట, కుమ్మరి రేవు, పోణంగి రోడ్డు, మార్కెట్ యార్డు ప్రాంతం, వెంకటాపురం, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. పాఠశాలల ప్రాంగణాల్లో మోకాలి లోతు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందికరంగా పరిణమించింది. సీఆర్‌ఆర్ కళాశాల ప్రాంతంలోని అండర్ పాస్, శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న రాజీవ్ స్నేహ వారధిల్లో నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల నుంచి తమ్మిలేరులోకి నీరు చేరడంతో శనివారపుపేట కాజ్ వే వద్ద నీరు వంతెనకు ఆనుకునే స్థాయికి నీటి ప్రవాహం చేరింది. రామచంద్రరావు పేట, నరసింహారావు పేట, పవర్‌పేట, అశోక్ నగర్, చాణక్యపురి కాలనీ, కొత్తపేట, ఒన్‌టౌన్‌లోని బిర్లాభవన్ సెంటర్, ఏడు ఘోరీల సెంటర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో సైతం డ్రెయినేజీలు నిండి మురుగు నీరు రోడ్లపై చేరి దుర్గాంధాన్ని వెదజల్లాయి. వానతో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు మందకొడిగా సాగాయి. చిరు వ్యాపారులు స్తంభించి ప్రధాన కూడళ్లు బోసిపోయాయి. తేనీటి ప్రియులతో టీ స్టాల్స్ వద్ద సందడి నెలకొనగా రెస్టారెంట్లలోనూ, బిర్యానీ పాయింట్ల వద్ద కొద్దిపాటి రద్దీ పరిస్థితి కనిపించింది.

జిల్లా కోర్టు ఆవరణ జలమయం

ఏలూరు (టూటౌన్): గడిచిన రెండు రోజుల నుంచి కురుస్తోన్న వర్షాలకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణ జలమయమైంది. అన్ని రహదారులపైనా వర్షం నీరు చేరింది. ముంపు నీటిలోనే కక్షిదారులు, అర్జీదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు కోర్టుకు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కోర్టుల ప్రాంగణం ప్రాంతం లోతట్టుగా ఉండటంతో కొద్ది పాటి వర్షానికే నీటమునుగుతుంది. కోర్టు ప్రాంగణం లోపలి ప్రాంతాన్ని మెరక చేసి, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలువురు న్యాయవాదులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లే ప్రజలు, న్యాయవాదులు వర్షం నీరు నిలిచిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నట్టు చెప్పారు.

రోడ్లపై ప్రవహిస్తున్న నీరు

ఎడతెరిపిలేని వర్షంతో రోడ్లపైనే నీరు ప్రవహిస్తోంది. ఏలూరు నాగేంద్ర కాలనీలోని మస్తాన్ మన్యం కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు పై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని నాలుగు, ఐదో డివిజన్ల మధ్య ఉన్న ఈ రోడ్డు, దానికి సమీపంలో ఉన్న చిన్నపాటి డ్రెయిన్లు, కొద్దిపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి వచ్చి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి డ్రెయిన్లతో పూడిక తీయించాలని వారు కోరుతున్నారు.

కాలనీ రోడ్డు గోతులమయం

ఏలూరు రూరల్ : ఏలూరు 18వ డివిజన్ పడమట లాకుల గట్టు జర్నలిస్ట్ కాలనీ నుంచి పోలీసుకాలనీ వెళ్లే దారి గోతులమయమైంది. చిన్నపాటి వర్షానికే బురదమయమైపోతుంది. గోతుల్లో వర్షపునీరు చేరి పాదచారుల, వాహదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కాజ్‌వేల పరిశీలన

ఏలూరు టౌన్‌: తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో డ్యామ్‌లు నిండిపోయి వరద నీరు దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. ఏలూరు నగరంలో తమ్మిలేరుకు వరద నీరు విడుదల కావడంతో నగరంలో కాజ్‌వే వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను పరిశీలించేందుకు ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ పలు ప్రాంతాల్లో పర్యటించారు. శుక్రవారం రాత్రి శనివారపుపేట కాజ్‌వే, సీఆర్‌రెడ్డి కళాశాల వద్ద కాజ్‌వే, కొత్తూరు జూట్‌మిల్లుకు వెళ్లేప్రాంతంలో కాజ్‌వేను ఆయన పరిశీలించారు. వరదనీరు కాజ్‌వేపై ప్రవాహించే అవకాశం ఉండటంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఏలూరు నగరంలో ముంపు ప్రభావం ఉండే ప్రాంతాలను పరిశీలించారు.



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పడమర లాకుల వద్ద నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : తూర్పువీధి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో చేరిన నీరు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సీఆర్‌ఆర్ కళాశాల వద్ద అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : తమ్మిలేరులో వరద నీటి ఉధృతి



శనివారపుపేట కాజ్‌వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ





ఏలూరు (టూటౌన్): వర్షం నీటి వద్ద కోర్టు ఆవరణలో నిలుచున్న కక్షిదారులు, న్యాయవాదులు, జిల్లా కోర్టు ఆవరణ ప్రధాన గేటు ఎదుట రోడ్డులో నిలిచిన నీరు



ఏలూరు (టూటౌన్) : మస్తాన్ మన్యం కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు



ఏలూరు రూరల్ : జర్నలిస్ట్ కాలనీ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గోతులు

పోలీస్ గూడుపై అశ్రద్ధ

నిరుపయోగంగా సబ్ కంట్రోల్ రూమ్‌లు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరం విస్తరిస్తోన్న నేపథ్యంలో నేరాల నియంత్రణకు పోలీస్ బాస్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది. ఏలూరు నగరపాలక సంస్థలో ఏడు పంచాయతీలు విలీనం కావటంతో జనాభా సైతం పెరిగింది. ఒకవైపు ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నిరోధానికి పోలీస్ అధికారులు కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాల్సి ఉంది. ఏలూరు జిల్లా కేంద్రం కావటంతో వీవీఐపీలు, వీఐపీలు, మంత్రుల పర్యటనలు ఉంటాయి. ఇక కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండడంతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కత్తిమీద సాములా మారుతుంది. ఏలూరులో నేరాలను అదుపు చేసేందుకు పోలీస్ ఉన్నతాధికారులు గతంలో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఒక్కటీ లేకపోవటం గమనార్హం. గొడవలు, ఘర్షణలు ఎక్కువగా చోటుచేసుకునే ప్రాంతాల్లో పోలీస్ నిఘా ఉండేలా వీటిని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా మారాయి.

- ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ ఎదురుగా పోలీస్ అవుట్ పోస్టును దశాబ్దకాలం క్రితం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గొడవలు నియంత్రించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు అవుట్ పోస్టును పెట్టగా, చాలా ఏళ్లుగా నిరుపయోగంగా మారి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీని పక్కనే మద్యం దుకాణం ఏర్పాటుచేయడంతో అది రాత్రి వేళల్లో మందుబాబులు అనువుగా మారింది.
- ఏలూరు తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ నిర్మించారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు నగరంలోకి ప్రజలు ప్రవేశించేందుకు ఈ రోడ్డును వినియోగిస్తారు. ఈ సెంటర్‌లో సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు ద్వారా తంగెళ్లమూడి పరిసర ప్రాంతాల్లో పోలీస్ పర్యవేక్షణ, విజిబుల్ పోలీసింగ్ చేసేందుకు అనువుగా ఉండేది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతోపాటు, పోలీసుల పర్యవేక్షణ ఉండడంతో నేరాలను అదుపు చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం సబ్ కంట్రోల్‌రూమ్ నిరుపయోగంగా మారింది.
- ఏలూరు ఖండ్రికగూడెం సెంటర్‌లో చాలాకాలం క్రితమే పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచీ చింతలపూడి మీదుగా ఏలూరు నగరంలోని ప్రవేశించేందుకు కండ్రికగూడెం సెంటర్ రోడ్డు ప్రధానంగా వినియోగిస్తారు. ఈ సెంటర్‌లో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రోడ్డు సైడ్ ఆక్రమణలతో నిరుపయోగంగా మారింది. కండ్రికగూడెం ప్రాంతానికి సమీపంలోని ప్రాంతాల్లో పోలీస్ నిఘా, విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలి.



ఏలూరు తంగెళ్లమూడి సెంటర్‌లో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్



ఏలూరు పవర్‌పేట స్టేషన్ ఎదురుగా శిథిలావస్థలో ఉన్న పోలీస్ అవుట్‌పోస్టు



ఏలూరు కండ్రికగూడెం సెంటర్‌లో ఆక్రమణలో సబ్ కంట్రోల్ రూమ్

ఉన్నతాధికారులు స్పందించాలి



ఏలూరు నియోజకవర్గంలో గతంలో ఏర్పాటు చేసిన పోలీస్ సబ్‌కంట్రోల్ రూమ్ వల్ల ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. పోలీస్ ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారిస్తే బాగుంటుంది.

– పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర సాహిత్య అకాడమి మాజీ చైర్‌పర్సన్

పారదర్శకంగా లెప్రసీ గుర్తింపు సర్వే

గణపవరం : కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరంలో లెప్రసీ డిటెక్షన్ సర్వే కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఏఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలన్నారు. స్పర్శలేని మచ్చలు, రాగిరంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే లెప్రసీగా అనుమానించి, వైద్యాధికారి వద్దకు పంపాలని సూచించారు. పీహెచ్‌ఓ జాలాది విల్సన్ మాట్లాడుతూ ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఒక్కో సర్వే బృందం రోజుకు 15 నుంచి 20 గృహాలు సందర్శించి సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్) : కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా మంచి పురోగతి సాధించచ్చని సెట్‌వెల్ విశ్రాంత సీఈఓ ఎండీఎం మెహర్రాజు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 30వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన 40 మందికి నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. ఏవీఆర్ విజ్ఞానకేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో మెహర్రాజు మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్‌లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, సర్టిఫికెట్లు అందుకున్న వారు ఇతరులను ప్రోత్సహించాలని సూచించారు. ఇరిగేషన్ డీఈ దేవరకొండ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమానికి శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కమ్ ఫ్యాకల్టీ ఎమ్మెస్ఎన్ లక్ష్మి స్వాగతం పలుకగా, పంచాయతీ విశ్రాంత ఈఓ, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు వీజీఎంవీఆర్ కృష్ణారావు, జయహో సమస్త ప్రతినిధి రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ఏలూరు రైల్వే ఎస్సైగా సైమన్



ఏలూరు టౌన్‌: మంగళగిరి రైల్వేశాఖ ఐజీ ఉత్తర్వుల మేరకు పీతల సైమన్ ఏలూరు రైల్వే ఎస్సైగా నియమితులయ్యారు. ఆయన శుక్రవారం ఏలూరులో బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జీఆర్‌పీ, రాజమండ్రి జీఆర్‌పీలో ఏఎస్‌ఐగా పనిచేస్తూ ఇటీవల ఆయన ఎస్సైగా పదోన్నతి పొందారు. ఆయనకు ఏలూరు రైల్వే నూతన ఎస్సైగా పదోన్నతి లభించింది.

దోమల నివారణ చర్యలు

ఏలూరు టౌన్‌: స్టాప్ డయేరియా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మలేరియా విభాగం నగరంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టినట్టు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. 41వ డివిజన్ చోడిదిబ్బ ప్రాంతంలోని ఏటిగట్టు, రెహ్మత్ నగర్, చిన్నరామాలయం, పెద్ద రామాలయం, తంగెళ్లమూడి మెయిన్ రోడ్డు, సచివాలయం ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేశామని, ఫాగింగ్ చేయించామని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సత్యనారాయణ, కె.విశ్వేశ్వరరావు, నాయకులు సంతోషి ప్రసాద్, ఆరోగ్య కార్యదర్శి, ఆశాకార్యకర్తలు ఉన్నారు.



మురుగునీటిని పరిశీలిస్తున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

ఏలూరు(మెట్రో): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 08812 232044కు బదులు, ఏలూరు డివిజన్‌లో వరదకు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా తన ఫోన్ నెంబర్ 94910 41424కు కాల్ చేయవచ్చని ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. 12 మండలాల తహసీల్దార్ల ఫోన్ నంబర్స్ తెలియజేశారు. అవి.. భీమడోలు 94910 41441, దెందులూరు 94910 41449, ఏలూరు 94910 41440, గణపవరం 94910 41450, కై కలూరు 98499 03990, కలిదిండి 99086 64641, మండవల్లి 98499 03980, ముదినేపల్లి 98499 03976, నిడమర్రు 94910 41453, పెదపాడు 94910 41444, పెదవేగి 94910 41445, ఉంగుటూరు 94910 41448. తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను ఆర్డీఓ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నదీపరివాహక ప్రాంతమైన సాయి నగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలు, తదితర ప్రాంతాల్లో ఆర్డీ ఓ పర్యటించారు.